క్లుప్తంగా

26 నుంచి టి-20 క్రికెట్ టోర్నీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ఎంఎంసీఏ టి-20 క్రికెట్ టోర్నీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 26 నుంచి టోర్నీ నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగిన జట్లు ఈ నెల 23వ తేదీలోపు సెల్ నం. 95022 19033కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకుడు మురళి కోరారు. తిరుపతి జిల్లా క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. విన్నర్స్‌కు రూ.70వేలు, రన్నర్స్‌కు రూ.50 వేలను దాతలు లక్ష్మీనారాయణ వినోద్ సౌజన్యంతో ఇస్తామన్నారు. మాజీ కౌన్సిలర్ ముత్తు, మోహన్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా తిరుమలరాజు

వరదయ్యపాళెం: మండల వైఎస్సార్ క్రాంతి పథం (వెలుగు) ఏపీఎంగా తిరుమలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఆర్‌డీఏ పరిధిలో ఏపీఎంగా ఉన్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



శ్రీకాళహస్తి: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని 17, 19వ వార్డులలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, ఫజిల్, గోరా, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ పోల్‌ను ఢీకొని మృతి



వరదయ్యపాళెం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కథనం.. బత్తలవల్లం గిరిజనకాలనీకి చెందిన కందుల ఉపేంద్ర (19) శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం సమీపంలోని తమ బంధువుల ఇంటికి తన బైకుపై బయలుదేరాడు. కారిపాకం చెరువు గట్టుపై వెళ్తుండగా పక్కనే ఉన్న కరెంటు పోల్‌ను ఢీకొన్నాడు. తలకు తీవ్రగాయమై మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ, కేసు నమోదు చేసి మృత దేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'స్వర్ణముఖి' కరకట్టకు మహర్దశ



కరకట్ట అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి స్వర్ణముఖి నది కరకట్టకు మహర్దశ ప్రాప్తించనుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్వర్ణముఖి నది వద్ద చేస్తున్న పనులను పరిశీలించి మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలాన స్వర్ణముఖి కరకట్ట చెత్తచెదారంతో నిండిపోయి, అధ్వానంగా తయారైందని, ప్రజలు అటువైపు వెళ్లాలన్నా సరైన మార్గం లేక ఇబ్బందులు పడేవారన్నారు. తాను 2019లో ఎమ్మెల్యే అయ్యాక దీని ప్రక్షాళనకు పూనుకున్నట్లు చెప్పారు. ఇప్పుడు తుడా సహకారంతో కరకట్ట సుందరీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు సాయం

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని వేలవేడు దళితకాలనీలో వెంకటసుబ్బమ్మ(58), యార్లపూడి లో వెంకటరత్నమ్మ(75), ఎంపేడు దళితకాలనీలో పోలయ్య(70) అనారోగ్యంతో, ఈంద్రపల్లికు చెందిన చెందిన వీరరాఘవులు(40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అలాగే పోలి దళితకాలనీలోని పార్టీకి చెందిన నరేంద్రబాబు(25) వారం క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

చోరీకి గురైన లారీ పట్టివేత

రేణిగుంట: రేణిగుంట చెక్‌పోస్ట్ సమీపంలో మంగళవారం రాత్రి చోరీకి గురైన లారీని శుక్రవారం పట్టుకుని నిందితుణ్ణి అరెస్ట్ చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇనుప కమ్మీల లోడుతో విజయవాడ మూలపాడు నుంచి తిరుపతికి వస్తున్న లారీలో నాయుడుపేట వద్ద ఓ వ్యక్తి ప్రయాణికుడిలా ఎక్కాడు. స్థానిక చెక్‌పోస్ట్ సమీపం గురవరాజుల్లె వద్దకు వచ్చాక రాత్రి సమయంలో టిఫిన్ చేసేందుకు డ్రైవర్ సోమయ్య కిందకు దిగివెళ్లాడు. ఆ సమయంలో లారీలో ఉన్న వ్యక్తి లారీని స్టార్ట్ చేసుకుని పరారయ్యాడు. బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. నాయుడుపేట–మేనకూరు మార్గంలో నిందితుణ్ణి లారీతో సహా పట్టుకున్నారు. లారీలో 32టన్నుల ఇనుప కమ్మీని కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కృష్ణా జిల్లా నూజివీడు సమీపంలోని కొత్తపల్లెకు చెందిన అనిల్‌కుమార్ అలియాస్ నాని(32)అని తేలింది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రేణిగుంట: రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గుత్తా మునిరత్నం 87వ జయంతి పురస్కరించుకుని శుక్రవారం కరకంబాడిలోని రాస్ మహిళాజ్యోతి మ్యూచువల్ ఫండ్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యులు డాక్టర్ నందిని, నమీరా, దినేష్‌ల బృందం స్థానికులతోపాటు కరకంబాడి హైస్కూల్ విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి డ్రాప్స్ పంపిణీ చేశారు. 20మందికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. మరో 30మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి వారిని అరవింద్ కంటి ఆస్పత్రికి తరలించారు. మరో 20మంది పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు, 25మందికి దుప్పట్లు, ఇద్దరికి టైలరింగ్ మెషిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం మాట్లాడారు. పొదుపు సంఘాల పీడీ వి.నాగరాజు, ట్రస్టీలు సుబ్బరత్నమ్మ, సుజాత, నిత్యసుధ, శ్యామల, ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, సిబ్బంది వెంకట్‌కుమార్, గౌతమి, ఇందుమతి, జ్యోతి, నాగమణి, స్వాతి, శంకరయ్య, బీటీవీ జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో శుక్రవారం రాస్, తిరుపతి నవజీవన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. పలు గ్రామాల నుంచి వచ్చిన 150 మందిని పరీక్షించారు. ఆపరేషన్‌కు 35 మందిని ఎంపిక చేశారు. అనంతరం పలువురికి చేతికర్రలు, కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, రాస్ డైరెక్టర్ నాగరాజునాయుడు, డాక్టర్ రమణ, డాక్టర్ అన్నాదొరై, బాలాజీరెడ్డి, రాజశేఖర్ నాయుడు, గిరిప్రసాద్, ముని పార్థసారథి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వేంకటేశ్వరుని సన్నిధిలో సంగీత దర్శకుడు పట్నాయక్



శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలోని టీటీడీ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని శుక్రవారం సినీ సంగీత దర్శకుడు, నటుడు ఆర్‌పీ పట్నాయక్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): ప్రకృతి వ్యవసాయంతో రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించడమే కాకుండా అధిక లాభాలు పొందవచ్చునని తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) మునిరత్నం నాయుడు అన్నారు. శుక్రవారం పెద్ద కనపర్తి, పూడి గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న వరిని ఆయన పరిశీలించారు. గ్రామ రైతులు శ్యామ్ సుందర్, బాబు నాయుడు, కనపర్తి నరేంద్ర నాయుడు, సుధాకర్ నాయుడుతో మాట్లాడారు. సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సభ్యుల ధ్వజం



వివిధ సమస్యలపై నిలదీస్తున్న సభ్యులు

వరదయ్యపాళెం: మండలంలో విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. శుక్రవారం ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రధానంగా 28 గ్రామ పంచాయతీల్లో పలు విద్యుత్ సమస్యలు తిష్టవేసి ఉన్నాయని సంబంధిత అధికారులకు నివేదించినా ట్రాన్స్‌కో ఏఈ పట్టించుకోవడం లేదని ఇందిరానగర్ సర్పంచ్ వీరభద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వెలుగు ఏపీఎం చంద్రబాబును 35 రోజులకే బదిలీ చేయడంలో ఆంతర్యమేమిటని అంబూరు సర్పంచ్ సాయిరెడ్డి నిలదీశారు. దళిత, గిరిజన మహిళల సంఘాల పేరిట అక్రమంగా పొందిన రుణాలను తక్షణమే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు ప్రకటించారు. పట్టాభూముల రెగ్యులరైజేషన్, రీ సర్వే, రికార్డుల క్రమబద్ధీకరణపై తహసీల్దార్ గౌరిశంకరరావు మాట్లాడారు. వరదయ్యపాళెం, చిన్న పాండూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్వేత, లావణ్య, పశు వైద్యాధికారి గౌరి తమ శాఖల కార్యక్రమాలపై మాట్లాడారు. ఎంపీపీ పద్మప్రియ మాట్లాడుతూ, విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు నివేదించమని ఎంపీడీఓను ఆదేశించారు. సమావేశంలో సింగిల్ విండో ఛైర్మన్ హరిబాబురెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో చిరుధాన్యాల సాగు

ఏర్పేడు: చిరుధాన్యాల సాగు పోషక భాండాగారమని జిల్లా వనరుల కేంద్రం డీటీసీ రత్నప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మేర్లపాకలో పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గంగాధరం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎంఎస్ఎన్ చౌదరి, ఏఓ షణ్ముగం, రైతులు పాల్గొన్నారు.

భార్యే భర్తను కడతేర్చింది

- అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు



ముకుంద



ఉదయ్‌సాయి

వరదయ్యపాళెం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ మహిళ తన భర్తనే కడతేర్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. చిన్న పాండూరు శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ కథనం.. నెల్లూరు జిల్లా గొలగమూడికి చెందిన వెంకయ్య, ముకుంద దంపతులు, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఇల్లందు ప్రాంతానికి చెందిన ఉదయ్‌సాయి, ఉషా దంపతులు మండలంలో చిన్న పాండూరు సమీపంలోని కోవూరుపాడు మిట్టఇండ్లలో పక్కపక్కనే ఇళ్లలో అద్దెకు ఉంటున్నారు. వీరు శ్రీసిటీలోని పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంకయ్య భార్య ముకుందతో పొరుగునే ఉన్నఉదయ్‌సాయికి కలిగిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇది వెంకయ్య కుటుంబంలో చిచ్చురేపింది. దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఇక, గర్భవతి అయిన ఉదయ్‌సాయి భార్య కాన్పుకు పుట్టింటికి వెళ్లింది. దీంతో ఉదయ్‌సాయి, ముకుంద మధ్య 'సాన్నిహిత్యం' బలపడింది. దీనికి అడ్డు తగులుతున్న తన భర్త వెంకయ్యను హతమార్చేందుకు ముకుంద తన ప్రియుడితో కలిసి స్కెచ్ వేసింది. ఈ నెల ఒకటో తేదీ రాత్రి ఆమె డ్యూటీకి వెళ్లింది. అదే సమయంలో ఉదయ్‌సాయి, ముకుంద భర్త వెంకయ్యను తీసుకెళ్లి సమీపంలోని తెలుగుగంగ కాలువ గట్టుపై నిద్ర మాత్రలు కలిపిన మద్యం తాగించాడు. దీంతో మత్తులోకి జారుకున్న వెంకయ్యను గంగకాలువ నీటిలో బోర్లా పడేసి తొక్కిపట్టుకుని హత్య చేశాడు. పోలీసులు ముకుంద, ఉదయ్‌సాయిని శుక్రవారం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేసేసరికి ఈ బాగోతం బట్టబయలైంది.

శివాలయాల్లో ఆరుద్ర అభిషేక పూజలు



శివగామి సమేత నటరాజస్వామి ఊరేగింపు



పరశురామేశ్వరస్వామి, కైలాసనాథుడు ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని శివాలయాల్లో ఆరుద్ర నక్షత్ర అభిషేక పూజలు శుక్రవారం భక్తిప్రపత్తులతో చేశారు. నాగలాపురం మండలం సురుటపల్లెలోని శ్రీ పల్లికొండేశ్వరాలయం, హరికంఠేశ్వరాలయం, పిచ్చాటూరు మండలంలోని రామగిరి శ్రీ వాలీశ్వరాలయం, కీళపూడి శ్రీ జలకంఠేశ్వరాలయం, నీరువాయి శ్రీ నీలకంఠేశ్వరాలయాల్లో వేకువ జామున నుంచే శివగామి సమేత నటరాజస్వామికి అభిషేక పూజలు చేశారు. శుక్రవారం పౌర్ణమి, శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర పర్వదినాలు రావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

పరశురామేశ్వర స్వామి ఆలయంలో..

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి వివిధ అభిషేకాలతో విశేష పూజలు చేశారు. అలాగే ఆనందవల్లి దేవి ఆలయంలో అభిషేకం, కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: ధనుర్మాస ఆరుద్ర నక్షత్రం రోజైన శుక్రవారం మండలంలోని శైవక్షేత్రాల్లో శివగామి సమేత నటరాజ స్వామికి ఆరుద్ర ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ అనుబంధ పరాశరేశ్వరస్వామి, పాలమంగళం పాలీశ్వరస్వామి, తుంబూరు తుంబీశ్వరస్వామి ఆలయాలతో పాటు కైలాసనాథకోన ఆలయాల్లో విశేష పూజలు, రుద్రాభిషేకాలు, సహస్రనామ బిల్వార్చన శాస్త్రోక్తంగా చేశారు. శివగామి, నటరాజ స్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సొరకాయలస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు చేశారు.

రైల్వే ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



రైలు ప్రమాదాల నివారణ, సేఫ్టీ చర్యలపై సీఆర్ఎస్‌లో నిర్వహిస్తున్న మాక్ డ్రిల్

రేణిగుంట: రైల్వే ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రయాణికులను కాపాడటం, ఇతరత్రా తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై శుక్రవారం రేణిగుంట సీఆర్ఎస్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌బాబు బృందం దీనిని నిర్వహించింది. సీఆర్ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ ఏ.దేవసహాయం సిబ్బందిని అభినందించారు. వారం రోజుల ట్రైనింగ్‌లో 70మంది సిబ్బందికి ఫైర్ ఫైటింగ్, ఇతరత్రా అంశాలపై ప్రదర్శనపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ హిమసాగర్, ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, మునిరాదయ్య పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



పూజిత(ఫైల్)

ఏర్పేడు: స్థానిక అశోక్‌నగర్‌లో ఓ యువతి అదృశ్యంపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం..స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన మారయ్య కుమార్తె పూజిత(16) గురువారం రాత్రి 7 గంటలకు ఇంటినుంచి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లు, రేణిగుంట, తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 94409 00729 నంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.